పెద్దిరెడ్డి దంపతుల సేవాస్ఫూర్తి అభినందనీయం

విశాలాంధ్ర-పులివెందుల: పెద్దిరెడ్డి దంపతుల సేవాస్ఫూర్తి అభినందనీయమని వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘు నాథరెడ్డి కొనియాడారు. మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన బలపనూరు కొత్తపల్లె నివాసి పెద్దిరెడ్డి , జయభారతి దంపతులు, తమకున్న దాంట్లోనే కొంతమొత్తం అవయవాలు లేని వికలాంగులకు బ్లాంకెట్స్, గృహోపకరణాల రూపంలో వితరణ అందించి, చేయూతనివ్వడం హర్షణీయమన్నారు. పేద కుటుంబంనుండి వచ్చినప్పటికీ , అంగవైకల్యంతో బాధపడుతున్న నిరుపేద వికలాంగులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ప్రముఖులు , సమాజంలోని అభాగ్యుల సేవకు పునరంకితం కావాలని వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వికలాంగుల కార్యాలయంలో పెద్దిరెడ్డి సతీమణి జయభారతి మాతృమూర్తి స్వర్గీయ చప్పిడి సుభద్రమ్మ స్మారకార్థం ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో, వారి కుటుంబ సభ్యులు 30 మంది దివ్యాంగులకు దుప్పట్లు, గృహోపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య, అనిల్, బాలయ్య, వల్లి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

681 మందికి వైద్యపరీక్షలు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణ పరిధిలోని బాకరాపురం, నగరిగుట్ట ప్రాంతాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో సుమారు 681 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసర మైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బాకరాపురంలో 367, నగరిగుట్టలో 324 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమములో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి వరప్రసాద్ వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వై ఎస్ మనోహర్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, మునిసిపల్ వార్డ్ కౌన్సిలర్లు, కమిషనర్ నరసింహ రెడ్డి మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,వార్డు వాలంటీర్లు పాల్గొనడం జరిగింది.

న్యాయం చేయండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : దళిత మహిళ గంగాదేవిని ప్రేమించి పెళ్లాడి మోసం చేసిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకుని బాధితురాలికి తగిన న్యాయం చేయాలని ఎంఎస్పీ, మాతయ్య నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితురాలైన గంగాదేవి మోహన్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకోవడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం గర్భవతిగా ఉన్న బాధితురాలిని భర్త మోహన్ ఏమాత్రం పట్టించుకోకుండా రెండవ వివాహం చేసుకోవడం దారుణమన్నారు. ఈ విషయంగా మైదుకూరు పోలీసు అధికారుల ను ఆశ్రయించగా వారు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. సంఘటనపై నాటి ఎస్పీ అన్బు రాజన్, ప్రస్తుత ఎస్పీ సిద్దార్థ కౌశల్‌ను కలిసి గంగాదేవి తమ వేదన వ్యక్తం చేసిందన్నారు. ఈ సంఘటనలో మోహన్ తోపాటు పోలీసు అధికారులపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విహెచ్పిఎస్ నాయకులు చిన్న సుబ్బయ్య యాదవ్ ఎం ఎస్ పి నాయకులు నరసింహులు తోపాటు బాధితురాలు గంగాదేవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

భార్య చేతిలో హత్యకు గురైన శివ

విశాలాంధ్ర-మదనపల్లి: నీరుగట్టువారిపల్లి రామిరెడ్డి లేఅవుట్లో కాపురం వుండే యువకుడు శివ(33)ను అతని భార్య ప్రియుడితో కలసి హత్యచేసిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గుట్టు చప్పుడు కాకుండా కలకడ మండలం సింగనొడ్డుపల్లెకు భార్య రవణమ్మ తీసుకెళ్లింది. కుటుంబీకులు మృతునిపై రక్తగాయాలుచూసి సీఐ మహబూబ్ బాషాకు చెప్పడంతో అయన ఘటన స్థలకివెళ్లి హత్యకుగల కారణాలపై ఆరా తీశారు. కేసుదర్యాప్తులో ఉందని తెలిపారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: సబ్ కలెక్టర్ కు అర్జీ ఇస్తే స్పందించి న్యాయం చేయలేదని ఓ బాధితుడు స్పందనలు అర్జీ ఇచ్చి సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర కలకలం రేపిన ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.. అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజక వర్గంలోని రామసముద్రం ఆంజనేయ స్వామి కాలనీలో కాపురం ఉంటున్న తలారి నాగప్ప కుమారుడు తలారి శ్రీరాములు (54) గత 15 ఏళ్లుగా ఇంటి స్థలం కోసం తహసీల్దార్ కు, సబ్ కలెక్టర్ కు, జిల్లా కలెక్టర్ కు అర్జీలు ఇచ్చిన ఇంటి స్థలం ఇవ్వకపోవడంతో మనస్థాపం చెందాడు. ఉన్న స్థలాన్ని ఇతరులు ఆక్రమించుకుని తను ఉంటున్న గుడిసెను దొబ్బేయడంతో మనస్థాపం చెంది సోమవారం మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఆర్డీవోకు స్పందనలో అర్జీ ఇచ్చాడు. ఆర్డీవో న్యాయం చేయకపోవడంతో తిరిగి తిరిగి ఓపిక నశించి, తీవ్ర మనస్థాపంతో జీవితం పై విరక్తితో సబ్ కలెక్టర్ ఆఫీసులోనే విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి బాధితుని వెంటనే మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

మూలపల్లె గ్రామంలో ప్రభుత్వ స్థలం కబ్జా

విశాలాంధ్ర-సిద్ధవటం: మండలం మూలపల్లె క్రాస్ కొండ ప్రక్కన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పశువుల కోసం గడ్డిని వేసుకునేందుకు జెసిబి తో చదును చేసి ఏకంగా ఫినిషింగ్ కూడా ఏర్పాటు చేసుకున్నారు రెవెన్యూ అధికారులు ఈ విషయం తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం తో పలు విమర్శలకు తావిస్తోంది ఈ విషయమై విఆర్ఓ చలపతిని వివరణ కోరగా స్థలం సర్వే నెంబర్ నాకు తెలియదని ఓ రైతు వామి వేసుకుంటున్నాడని గ్రామ నౌకరి తెలిపారని విచారిస్తాన ని పేర్కొన్నారు.

రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో చోరీ

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో చోరీకి గురైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..... సోమవారం వేకువ జామున ఆలయ పూజారి ఆంజనేయులు రోజువారి కార్యకలాపాల ప్రకారం అమ్మవారి ఆలయానికి తెరచడానికి వెళ్లగా అక్కడ గేటు పగలగొట్టి ఉండడాన్ని గమనించి,అలాగే అమ్మవారి తలుపు పూర్తిగా తెరిచి ఉండడానికి గమనించి పీలేరు పోలీసులకు మరియు ఆలయ చైర్మన్ భాస్కర్ రెడ్డి కి సమాచారం అందించారు. అమ్మవారి తాళి బొట్టు, వెండి వస్తువులు పోయినట్లు నిర్ధారించుకున్నారు. అలాగే శ్రీ రౌద్రాల అంకాలమ్మ గంగమ్మ దేవత దేవస్థానం హుండీ ఆదాయం రూ. 1,22,176/- రెండు రోజుల క్రితమే బ్యాంకు కు జమ అయినాయి. వీటితో పాటు పక్క ఆలయం మహాలక్ష్మి అమ్మ వారి తాళి బొట్టు కూడ అపహరించుకొని వెళ్లారు.ఈ మేరకు పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీజీబీ వారి 'అప్రమత్తత ..అవగాహన' కార్యక్రమాలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వారు భారత ప్రభుత్వం సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వారి ఆదేశాల మేరకు 30.10.2023 నుండి 05.11.2023 వరకు అప్రమత్తత అవగాహన నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కడప పట్టణంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో తమ కార్యాలయ సిబ్బంది చేత 30.10.2023 న బ్యాంక్ చైర్మన్ రాకేశ్ కశ్యప్ నిబద్ధతా ప్రమాణం చేయించారు. వారోత్సవాలు సందర్భంగా బ్యాంక్ ఏర్పాటు చేసిన సమావేశంలో బ్యాంక్ చైర్మన్ రాకేశ్ కశ్యప్ మాట్లాడుతూ వ్యక్తిగత మరియు సామాజిక జీవితంలో నిజాయితీ తో పారదర్శకంగా తమ విధులను నిర్వహించడంద్వారా మరియు స్వీయ అప్రమత్తత కలిగి వుండడం ద్వారా దేశాన్ని అవినీతి రహిత భారత దేశంగా రూపొందించగల మని, సెంట్రల్ విజిలెన్సు కమిషన్ వారి " అవినీతి వద్దని చెప్పండి - జాతికి కట్టుబడి వుండండి" పిలుపును సాకారం చేయగలమని తెలియజేశారు. ఈ వారోత్సవాల సందర్భంగా బ్యాంక్ లోని వివిధ కార్యాల యాలూ మరియు శాఖలలో "అవినీతి వద్దని చెప్పండి - జాతికి కట్టుబడి వుండండి" అనే అంశంపై సదస్సులను నిర్వహించనున్నారు. బ్యాంక్ సిబ్బందికి పోటీ, స్కూల్ మరియు కాలేజ్ పిల్లలకు వ్యాస రచన వక్తృత్వ పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలను అందజేయనున్నారు. ఈ నిఘా అవగాహన వారోత్సవాల ప్రారంభ సమావేశంలో బ్యాంక్ చైర్మన్ రాకేశ్ కశ్యప్, సీవీఓ జనరల్ మేనేజర్ సంజీవప్ప, జనరల్ మేనేజర్లు రాజేంద్రన్, గిరి, చీఫ్ మేనేజర్లు, అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : అన్నం పరబ్రహ్మ స్వరూప మని ఆకలిగొన్న వారికి అన్నం పెడితే స్వర్గానికి దేవుడు దారి ఏర్పాటు చేస్తాడని ఒక వడ్లగింజ వేస్తే 150 వడ్లగింజలు మొలుస్తాయని అలాగే మనం ఒకరికి అన్నం పెడితే మనం మూడు పూటలా అన్నం తినవచ్చని దీన్ని అన్నం పరబ్రహ్మస్వరూపమని ఒంటి మిట్ట మండల తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు తమ్మిశెట్టి అయ్యవారయ్య అన్నారు. సోమవారం కడప- చెన్నై ప్రధాన రహదారిలో ఉన్న కాశీవిశ్వేశ్వర దేవాలయం నందు ఒంటి మిట్ట శ్రీ సాయిభారతి స్కూల్ కరస్పాండెంట్ వెంకటరమణ జ్ఞాపకార్థం వారి భార్య తులసి ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణకు తమ్మిశెట్టి అయ్యవారయ్య ముఖ్యఅతిథిగా హాజరై అన్నప్రసాదాన్ని భక్తులకు పర్యాటకులకు, యాచకులకు ప్రయాణీకులకు బాటసారులకు వితరణ చేశారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఇది పుణ్య కార్యక్రమని ఒంటిమిట్ట దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నదాన కేంద్రాలు ఎక్కువ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో వంటమాస్టర్ రమణ, భక్తులు, పర్యాటకులు, యాత్రికులు, యాచకులు, శివాలయ ధర్మకర్త గుండ్రాతి మహేశ్వరయ్య, సూర్య విలేకరి ముస్తఫా, దళిత నాయకుడు కత్తి అయ్యవారయ్య, కత్తి చంద్ర పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని కార్మికులు తమ పిల్లల ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని రాయచోటి బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఒకటి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు నవంబర్ 31వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని, అలాగే ఇంటర్ ,డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు డిసెంబర్ 31 వ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత ఏడాది విద్యార్థుల మార్కుల జాబితా, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, బీడీ కార్మికుల గుర్తింపు కార్డు, సంవత్సర ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్పోర్ట్ సైజు ఫోటో వంటి అంశాలతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్మికుల పిల్లలకు 2023 - 24 విద్య సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలకు నేషనల్ పోర్టల్ వెబ్ సైట్ లో వివరాలు అందుబాటులో ఉంచిందని, ఆ వెబ్ సైట్ లో సంబంధిత వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. బీడీ కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రాత్రి పూట తిరిగే ఆటోలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు పట్టణంలో పోలీసులు అనుమతి ఇచ్చిన రాత్రి పూట తిరిగే అయిదు ఆటోలకు మాత్రమే తిరుగుతాయని బిస్మిల్లా ఆటో యూనియన్. రాష్ట్ర అధ్యక్షులు. బోదేశవల్లి తెలిపారు. ఈ సందర్భంగా బోదేశ మాటలాడుతు స్థానిక పీలేరు పోలీస్ స్టేషన్ కార్యాలయంలో పీలేరు అర్బన్ సీఐ. మోహన్ రెడ్డి సమక్షంలో, ఆయన చేతుల మీదుగా అయిదు మంది ఆటో డ్రైవర్ లకు పోలీసుల గుర్తింపు కార్డులు ఇచ్చారు. సీఐ మాటలాడుతు రాత్రి పూట ప్రయాణికులుకు తమ గమ్య స్థానాలకు చేరావేయాలని,నిర్ణిత చార్జీలు మాత్రేమే వసూలు చేయాలని,అనుమానస్పద వ్యక్తులు ఉంటే తక్షణమే పోలీస్ వారికీ, సీఐ,ఎస్.ఐ. నెంబర్ లు 9440796744, 9440796745, సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

న్యూ ఢిల్లీ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో ప్రతిభ కనపరిచిన మిట్స్ విద్యార్థులు

విశాలాంధ్ర- మదనపల్లి : న్యూ ఢిల్లీ లో జరిగిన ఇండియా మొబైల్ కాం గ్రెస్ ఇ ఎం సి మిట్స్ కల శాల కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగము లో చివరి సంవత్సరము బి.టెక్ చదువుతున్న కె. సఫియా, ఎ.కృష్ణ, పి.శివ సాయి, ఎస్.యసస్వి మరియు టి.శ్రీజ అను విద్యార్థులు అగ్రికల్చర్ విభాగంలో జాతీయ స్థాయి లో ద్వితీయ బహుమతి లభించింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఐ ఎం సి అనేది ఆసియాలో అతిపెద్ద టెలికాం, మీడియా మరియు టెక్నాలజీ ఫోరమ్ అని, దీనిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ డీ ఓ టీ మరియు సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సి ఓ ఏ ఐ సంయుక్తంగా నిర్వహించాయి అని అన్నారు. ఇందులో జాతీయ స్థాయి లో విద్యార్థులు కమ్యూనికేషన్ రంగం లో నూతనంగా కనుగొన్న టెక్నాలజీ లను ఇందులో ప్రదర్శితారని, అందులో విద్యార్థులు అగ్రికల్చర్ (వ్యవసాయ) విభాగము లో రెండవ బహుమతి లభించిందని అన్నారు. విద్యార్థులు తయారుచేసిన బౌదరీ ఫైండింగ్ స్టిక్క అను అప్ ను ఇందులో ప్రదర్శించి ఈ బహుమతి పొందినట్లు ఆయన అన్నారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఆసియాలోనే అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్, టెక్నాలజీ రంగంలో భారతదేశంలోనే అతిపెద్ద నెట్‌వర్కింగ్ ఈవెంట్. విప్లవాత్మక ఆవిష్కరణల ప్రదర్శన ద్వారా, భారతదేశాన్ని వెలుగులోకి తీసుకురావడం ముఖ్య ఉద్దేశంగా న్యూ ఢిల్లీ లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం, విద్యార్థులు అందులో పాల్గొని ప్రతిభకనపరచడం గర్వించదగ్గ విషయం అని ఈ విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

అరాచక పాలనకు చమర గీతం తప్పదు

విశాలాంధ్ర -రాజంపేట: రానున్న 2024 ఎన్నికల్లో వైసిపి అరాచక పాలనను తరిమి కొట్టడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని ఎన్నారై టిడిపి కువైట్ ప్రధాన కార్యదర్శి మల్లీ మారోతు అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపుమేరకు కువైట్ నగరంలో జగనాసురుడికి కళ్ళు తెరిపిద్దాం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన చంద్రబాబు అక్రమ అరెస్టును అన్ని రాష్ట్రాలు ఖండించడం జరుగుతోందన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నేతను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్రంలో టిడిపికి పెరుగుతున్న ఆదరణ ఓర్వలేక అక్రమంగా అరెస్టు చేయడం జరిగిందన్నారు. అనంతరం అధికార పార్టీకి వ్యతిరేకంగా కళ్ళకు గంతులు కట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ అధ్యక్షులు శంకర్ యాదవ్, గుండయ్య నాయుడు, మల్లీ శెట్టి రవి,ఎన్టీఆర్ సేవాదళ్ కస్తూరి కోటేశ్వర్, రెడ్డయ్య నాయుడు, నర్సారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

కాలమ్స్ విజన్ 2023 విజ్ఞాన మేళాను సద్వినియోగం చేసుకోవాలి



విశాలాంధ్ర-రాయచోటి: విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను నైపుణ్యాలను, విజ్ఞానాన్ని వెలికితీసి ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న కాలమ్స్ విజన్ 2023 కార్యక్రమాన్ని జిల్లా లో వుండే హై స్కూల్ విద్యార్థులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. సోమవారం స్థానిక ప్రతిభ కళాశాలలో ఆర్గనైజర్, ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోస్టర్ నీ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం, ప్రతిభా కళాశాల చైర్మన్ శివ గంగిరెడ్డి , ఇంటర్నేషనల్ మెరిట్ హై స్కూల్ హెడ్ మాస్టర్ కిషోర్ కుమార్ రెడ్డి , ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ పురుషోత్తం మాట్లాడుతూ కాలమ్స్ విజన్ 2023 లో ప్రతి విద్యార్థీ శాస్త్ర విజ్ఞానంపట్ల ఉత్సాహం చూపించి, శాస్త్రవేత్తలుగా ఎదగాలని తద్వారా రాష్ట్రానికి దేశానికి ఉపయోగపడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉండే ప్రైవేట్, గవర్నమెంట్ పాఠశాలలు కాలమ్స్ విజన్ 2023 లో పాల్గొనాలన్నారు. విజ్ఞాన మేళకు జిల్లా విద్యాశాఖ సంపూర్ణ సహకారాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. విద్యార్థులులో సృజనాత్మకను వెలికితీసేందుకు, సైన్స్ పై ఆసక్తిని పెంపొందించేందుకు కాలమ్స్ విజన్ విజ్ఞానమేల ను ను వినయ్ కుమార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. శివ గంగి రెడ్డి మాట్లాడుతూ మానవ మనుగడకు సైన్సు ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు.విద్యార్థి దశ నుంచే విద్యార్థులు విజ్ఞానం పట్ల ఆసక్తి చూపాలన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించటం అలవాటు చేసుకోవాలని అప్పుడే మనం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. కాలమ్స్ విజన్ సైన్స్ ఎగ్జిబిషన్ లో పాల్గొని ప్రతి విద్యార్థి వారి ప్రాజెక్టులను నమోదు చేసుకోవాలన్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉండే ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యార్థులు అందరూ తమ ప్రాజెక్టులను ప్రదర్శించవచ్చు అని పిలుపునిచ్చారు . కాలమ్స్ విజన్ 2023లో ఈ నెల నుండి రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు అయిన తెలిపారు. సంబంధిత వివరాల కొరకు 6281453550, 9391932752 నంబర్లను సంప్రదించాలన్నారు. నవంబర్ 28 ,29 వ తేదీలలో ఇంటర్నేషనల్ మెరిట్ హై స్కూల్ నందు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రియుడితో కలసి భర్తను హత్య చేసిన భార్య

- గుట్టు చప్పుడు కాకుండా స్వగ్రామానికి ఆటోలో తరలించిన నిందితులు..

- సమాచారం అందుకుని కూపి లాగడంతో హత్య కేసు వ్యవహారం వెలుగులోకి....

విశాలాంధ్ర -మదనపల్లి : ప్రియుడుతో కలిసి కట్టుకున్న భర్తను అతి కిరాతకంగా హత్య చేసిన భార్య భూతం సోమవారం మదనపల్లిలో వెలుగు చూసింది. తీవ్ర కలకలం రేపిన ఘటనకు సంబంధించి మదనపల్లి ఒకటో పట్టణ పోలీసులు మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం సింగినోడ్డి పల్లికి చెందిన దాదినాయిని రఘునాథ్ కుమారుడు శివ 33 మదనపల్లి పట్టణం నీరు గట్టు వారి పల్లెలోని రామిరెడ్డి లేఔట్ లో అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేస్తూ భార్య రమణమ్మ తన ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శివ పచ్చని సంసారంలో భార్య రవణమ్మ వివాహేతర సంబంధం చిచ్చు రేపింది. స్థానికంగా ఉన్న యువకుడితో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న రవణమ్మ భర్త అడ్డు తొలగించుకోవడానికి పథకం వేసింది. ప్రియుడితో కలిసి ఉండడం సోమవారం ఉదయం చూసిన శివ భార్యతో గొడవ పెట్టుకున్నాడు. గొడవ తార స్థాయికి చేరడంతో భార్య ఆమె ప్రియుడు కలిపి శివను దారుణంగా కొట్టి హతమార్చారు. అనంతరం గుర్తు చప్పుడు కాకుండా ఆటోలో మృతిని స్వగ్రామమైన కలకడ మండలం సింగనుడి పల్లికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు కుమారుడి శివ పై ఉన్న రక్త గాయాలు చూసి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన మదనపల్లి ఒకటవ పట్టణ సీఐ మహబూబ్ బాషా సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శివ భార్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉందని పోలీసులు తెలిపారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించాలి

విశాలాంధ్ర -కడప : ఫౌండేషన్ లిటరసీ మరియు న్యూమరసిలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పనిచేస్తున్న చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ మరియు సూపర్వైజర్లుకు మరియు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీ, కడప నందు సోమవారం నాడు లాంఛనంగా ప్రారంభించారు. ఈ శిక్షణ ప్రారంభ కార్యక్రమంకి జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి మరియు జిల్లా విద్యా శాఖ అధికారి గార్లు ముఖ్య అతిదులుగా విచ్చేసి శిక్షణలో పాల్గొన్న జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్స్ ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు గల పిల్లలు అందరూ తప్పకుండా చదవడం, రాయడం, మరియు చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం ఈ శిక్షణ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. కావున శిక్షణ లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ కూడా ఈ శిక్షణ కార్యక్రమంను సద్వినియోగం చేసుకొని మీరు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ కి మరియు మిగిలిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం అమలు అయ్యే విధంగా చేయాలి అని తెలియజేశారు. అదేవిధంగా విద్యార్థులకు చదువుతో పాటు సంస్కారం జ్ఞానం తో పాటు లోకజ్ఞానం పెంపొందించే దిశగా మరియు భయము కన్నా భక్తి భావాలు మిన్న గా ఉండే విధంగా విద్యాబోధన జరగాలని తద్వారా నైతిక విలువలు పెంపొందించి నిజ జీవితంలో ఉన్నత స్థానాలు చేరుకుంటారని ఆయన అన్నారు అదేవిధంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు శిక్షణను పొంది నాణ్యమైన విద్యాబోధనకు కృషి చేయాలని ఆయన అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి రాఘవ రెడ్డి మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలందరూ కూడా చిన్నపిల్లలు కాబట్టి వారికి ఆటపాటలు, కృత్యాలు, కథల ద్వారా బోధన చేసినట్లయితే వాళ్ళు చక్కగా అవగాహన చేసుకుని నేర్చుకోవడానికి వీలవుతుందని చెప్పడం జరిగింది. కృత్యాల ద్వారా ఎప్పుడైతే బోధన జరుగుతుందో పిల్లవాడు పాఠశాల రావడానికి ఆసక్తి పెరుగుతుంది తద్వారా డ్రాప్ ఔట్ స్థాయిని తగ్గించవచ్చు అని వివరించడం జరిగింది. అలాగే విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల ఆరోగ్యంగా మరియు మానసికంగా బాగా ఉన్నప్పుడు మాత్రమే విద్యార్థి లో అభ్యసన స్థాయి బాగా జరుగుతుంది. కాబట్టి ఆరోగ్యంగా మరియు మానసికంగా ఉండడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ శిక్షణా కార్య క్రమానికి పర్యవేక్షకురాలిగా అకాడమీక్ మానిటరింగ్ అధికారి ధనలక్ష్మి, రామాంజనేయ రెడ్డి, విజయ లక్ష్మి, కీ రిసోర్స్ పర్సన్ లుగా మరియు వరలక్ష్మి వ్యవహరించారు.

సమాధుల తొలగింపుపై పునరాలోచించాలని వినతి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని పేరు ప్రఖ్యాతిగాంచిన యాకూబ్ సాహెబ్ ఖబరస్తాన్‌లో ఉన్న సమా ధులను తొలగిం చాలని జరుగుతున్న విషయం మీ అందరికీ తెలిసినదే. ఈ విషయం పైన కడప డిస్టిక్ కలెక్టర్‌ని కలిసిన, వి.ఎస్.అమీర్ బాబు, మసీదు కమిటీ మతపెద్దలు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయం పైన మరొకసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇవ్వడం జరిగినది. కలెక్టర్ మాటల అనంతరం వారు కచ్చితంగా ఖబరస్తాన్ సమాధుల విషయంలో మాకు న్యాయం జరుగుతుందని భావించి కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చిన వారిలో వి.ఎస్. అమీర్ బాబు, మజీద్ కమిటీ ప్రెసిడెంట్ నిసార్‌అహ్మద్, సెక్రెటరీ ఫారుక్, అడ్వేకెట్ అలీ ఖాన్, అక్రమ్, హమీద్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ కమిటీ ఎంపిక ఏకగ్రీవం

విశాలాంధ్ర-మదనపల్లె : రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ కమిటీ ఎంపిక ఏకగ్రీవమైనట్లు దక్షిణ భారత అధ్యక్షులు గంపల గంగరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో కమిటీని ప్రకటించారు. ఇందులోభాగంగా రాష్ట్ర అధ్యక్షుడిగా మేకల విజయ్ మోహన్, ఉపాధ్య క్షులుగా పూలకుంట్ల హరి, కృష్ణమూర్తి, యువజన విభాగం అధ్యక్షుడిగా టేకుపల్లె శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా బొగ్గిటి కృష్ణమూర్తి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా పిడుగు రఘునాథ్, ఉపాధ్యక్షుడిగా మేకల వెంకటరమణలను నియమించినట్లు వివరించారు. అలాగే నియా మక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గంపల గంగరాజు మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీంతో ఎస్టీ సాధన సాధ్యమవుతుందన్నారు. ఎస్టీ సాధనే లక్ష్యంగా కమిటీ సభ్యులు పనిచేయాలంటూ ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పదవులు అప్పగించిన జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎస్టీ సాధనతో పాటు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామంటూ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కాగా కమిటీ ఎంపికపై సంఘం సభ్యులు, కుల బాంధవులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

స్పెషల్ కాంపెయిన్ డేస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-పీలేరు:ఎస్ఎస్ఆర్ 2024లో భాగంగా నవంబర్ 4, 5 మరియు డిసెంబర్ 2, 3 తేదీలలో జరగనున్న స్పెషల్ క్యాంపెయిన్ డే లను సద్వినియోగం చేసుకోవాలని పీలేరు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ గోపాలకృష్ణ పీలేరు ప్రజలకు కోరారు.పీలేరు నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు ముసాయిదా జాబితా ఇప్పటికే విడుదల అయ్యిందని, దానిలో ఏదైనా తప్పులు, మార్పులు, చేర్పులు అభ్యంతరాలు ఉంటే దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం స్పెషల్ క్యాంపెయిన్ డే లను ఏర్పాటు చేసిందన్నారు.స్పెషల్ క్యాంపెయిన్ డే లలో ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బిఎల్వోలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంటారన్నారు. అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు నమోదు చేసుకోదలచిన ప్రజలు ఆ సమయంలో బిఎల్ఓలను సంప్రదించి లిఖితపూర్వకంగా వాటిని అందజేయవచ్చునన్నారు.. స్పెషల్ క్యాంపెయిన్ డేలలో రాజకీయ పార్టీలకు చెందిన బి ఎల్ ఏ లను కూడా అనుమతిస్తామని, వారు కూడా ఆరోజు పోలింగ్ కేంద్రంలో ఉండవచ్చునన్నారు.స్పెషల్ క్యాంపెయిన్ డే లను సద్వినియోగం చేసుకుని, ఎటువంటి తప్పులు లేని పరిశుద్ధమైన ఓటరు జాబితా తయారు చేసేందుకు తమకు సహకరించాలని చేశారు.

జగన్ బ్యాచ్ చేసే అక్రమాలను ఉమ్మడిగా ఎదుర్కోవాలి

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్: రాబోయే ఎన్నికల ను సమర్థవంతంగా ఎదర్కొని వైసిపిని ఓడించి తీరుతామని టిడిపి, జనసేన నేతలు స్పష్టం చేశారు. కడప నగరంలోని శ్రీనివాస రెసిడెన్సీలో జనసేన, టీడీపీ ఉమ్మడి కడప జిల్లా స్థాయి ఆత్మీయ సమావేశంలో భవిష్యత్తు రాజకీయ కార్యచరణపై చర్చించారు. జగన్ బ్యాచ్ చేసే అక్రమాలను ఉమ్మడిగా ఎదర్కొంటామని, అన్ని రంగాల్లో దొపిడీ తప్ప ఈప్రభుత్వంలో అభివృద్ధి లేదని కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమాల్ లు అన్నారు. జనసేన, టిడిపి మధ్య తగాదాలు సృష్టించేందుకు జగన్ సోషల్ మీడియాను సిద్ధం చేసుకున్నారని దాన్ని సమర్థవంతంగా ఇరువురం ఎదుర్కొంటా మన్నారు. 2004లో జగన్ తండ్రి వైఎస్ ఆర్ పొత్తు పెట్టుకుని పోటీ చేయలేదా అని సోమిరెడ్డి ప్రశ్నించారు.ఆనాడు వైఎస్ ఆర్ ఎందుకు సింగల్ గా పోటీ చేయలేక పోయారని ప్రశ్నించారు. తాము ఎవరితో పొత్తు పెట్టుకుంటే వైసిపీకి వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. వైసిపీతో ఎవరూ పొత్తు పెట్టుకునే పరిస్థితి లేదన్నారు.జగన్ అన్న రాగానే కరువు, కరోనా కలిసి వచ్చాయని, రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నా వ్యవసాయ, ఇరిగేషన్ మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అరాచకాలు, అక్రమాలు, భూ కబ్జాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి, సంక్షేమ పై లేదని, దోచుకోవడం పై ఉన్న శ్రద్ధ ఉపాది కల్పనపై లేదని జనసేన నేత నాయబ్ కమాల్ ఆరోపించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, అమీర్ బాబు, హరి ప్రసాద్, పుట్ట సుధాకర్ యాదవ్, జగన్మోహన్ రాజు, నారాయణరెడ్డి, భూపేష్ రెడ్డి, పార్థసారథి రెడ్డి, సుంకర శ్రీనివాసులు జనసేన నాయకులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఎంసెట్ మూడవ కౌన్సిలింగ్ నిర్వహించాలి

కలెక్టర్‌కి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం

విశాలాంధ్ర- రాయచోటిటౌన్: రాయచోటి న్యూస్ : ఇంజనీరింగ్ బీటెక్ కోర్సులో మూడవ కౌన్సిలింగ్ నిర్వహిం చాలని ఈరోజు సోమ వారం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ లో అన్నమయ్య జిల్లా కలెక్టర్ కలెక్టర్ కి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి ,జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ బీటెక్ ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి ఈ విద్యా సంవత్సరం మొదటి రెండవ విడత కౌన్సిలింగ్ నిర్వహించారు. అందులో కేవలం 60 శాతం సీట్లు మాత్రమే భర్తీ కావడం జరిగిందని పేర్కొన్నారు. మిగతా 40 శాతం సీట్లు మిగిలి ఉన్నాయని తెలిపారు.. కొంతమంది విద్యార్థులు రెండవ కౌన్సిలింగ్లో సీటు వచ్చిన వారికి నచ్చని కళాశాలలో సీటు రావడంతో మూడవ కౌన్సిలింగ్ కోసం చాలామంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40% సీట్లు ఖాళీగా ఉన్నా కూడా మూడవ కౌన్సిలింగ్ నిర్వహించకుండా స్పాట్ పేమెంట్ ద్వారా సీట్లను భర్తీ చేయాలని చూస్తుందని పేర్కొన్నారు. దీనివల్ల ఒక విద్యార్థి సంవత్సరానికి రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు చెల్లించి సీటు కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. పేద మధ్యతరగతి చదువుతున్న విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యకు దూరమయ్యే పరిస్థితి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమో విద్యకు పెద్దపీట వేస్తానని గొప్పలు చెప్తా ఉంది కానీ ఆచరణలో మాత్రం విద్య పేరుతో భయంకరమైన దోపిడీ చేస్తుందని తెలిపారు... తక్షణమే విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి బిటెక్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మూడవ కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు వెంకట కుమార్, మదన్ గోపాల్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా

ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి: ఎస్పీ

విశాలాంధ్ర-కడప : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ క్రైమ్ బారిన పడ్డ బాధితులు ఫిర్యాదు మేరకు సంబంధిత పోలీస్ అధికారులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్.పి సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్ కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్ లైన్ వెబ్ సైట్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో మరియు టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయొచ్చని ప్రజలకు జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ ఐ.పి.ఎస్ సూచించారు.

రైలు దుర్ఘటన బాధాకరం

విశాలాంధ్ర-పులివెందుల: విజయనగరం జిల్లాలో జరిగిన రైలు దుర్ఘటన ఎంతో బాధాకరమని పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వేలూరు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైలు దుర్ఘటన అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోందన్నారు. ఇప్పటికే అనేక రైలు సంఘటనలు జరిగి వందలాది మంది మృతి చెందినప్పటికీ కేంద్ర రైల్వే మంత్రి కానీ ప్రధానమంత్రి కానీ వీటికి శాశ్వత పరిష్కారం చూపకపోవడం సిగ్గుచేటన్నారు. . అధికారుల నిర్లక్ష్య ధోరణికి చరమ గీతం పాడిన నాడు ఇలాంటి సంఘటనలు జరగవు అన్నారు. వెంటనే మృతుల కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనివ్వాలని క్షతగాత్రుల కుటుంబాలను కూడా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ వెంకటేష్, మహేంద్ర, పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి సమీక్షించారు. అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రతి కాంట్రాక్టరు నిర్దేశిత గడువులోపూ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభ్యున్నతికి కృషిచేస్తాం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : ప్రభుత్వ అనాలోచిత నిర్ణ యాల వలన బలహీనపడు తున్న ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని నూతన ఎస్టీయు మండలశాఖ అధ్యక్షుడు కె.పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఎ.జయ రామిరెడ్డి, ఆర్థిక కార్యదర్శి బి. భాషలు తెలిపారు. ఆదివారం పోరుమా మిళ్లలో జరిగిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పి.రమణా రెడ్డి తెలిపారు. ఎంతో ప్రాధా న్యత కలిగిన విద్యారంగంలో సంస్కరణలు చేపట్టే టపుడు ఆచితూచి అడుగేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మెప్పుకోసం అమలు చేస్తున్న విలీన ప్రక్రియ కారణంగా ప్రాథమిక విద్యారంగం ప్రమాదపుటంచుల్లో ఉందని చెబుతున్నా వినే నాథుడే కరువయ్యాడన్నారు. గ్రామాలలోని ఇళ్ల మధ్యలో ఉన్న బడిని మూసేసి ఎక్కడో ఒక కిలోమీటరు దూరంలోని ఉన్నత పాఠశాలలకు వెళ్లమంటే, పిల్లల భద్రతపై అనుమానాలతో తల్లిదండ్రులు ఇళ్లవద్దకు వచ్చే ప్రైవేట్ స్కూల్ వ్యాన్లు ఎక్కిస్తున్నారన్నారు. ఇప్పటికైనా పునరాలోచించి విలీన ప్రక్రియను ఉపసంహరించు కోవాలన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె పంచాయతీ పరిధిలోని 17వ వార్డులో కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు సోమవారం అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కుక్కల బెడద విషయమై ఎన్నో మార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనంలేదన్నారు. రాత్రివేళ ఇళ్లకు వెళ్లాలంటే అవి మీదపడి ఎక్కడ కరుస్తాయోనని భయంగా ఉందన్నారు. అలాగే ఆయా ప్రాంతంలో పాఠశాలలు ఉన్నందున విద్యార్థులకు వెళ్లాలంటూ జంకుతున్నారు. విద్యార్థులు కూడా భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు.

సంక్షేమ పథకాలతోనే మళ్లీ వైసీపీ అధికారం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతోనే మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేసి నవంబర్ 9వ తేది నుండి ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలపైన అడిగి తెలుసుకోవాలని, ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరినాయా చేరలేదా అని అడిగి తెలుసుకోవాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేమారెడ్డి అన్నదాన సత్రంలో గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లతో, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి అధ్యక్ష వహించిన ఎంపీపీ వీరనారాయణరెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాష్ట్రానికి మళ్లీ జగన్ ఎందు కనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వం యొక్క సంక్షేమపథకాలు, ఇచ్చిన హామీలనె నెరవేర్చిన ప్రభుత్వం వైకాపా ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వం మాట ఇచ్చి ఏ ఒక్క పథకం అమలు చేయకపోవడం ప్రజలను అడ్డగోలుగా మోసం చేసిన ప్రభుత్వం గత టీడీపీ ప్రభుత్వం అన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ హామీలు కూడ ప్రతి కుటుంబానికి సంక్షేమపథకాలు, కులమతాలకు అతీతంగా అమలు చేసిన ప్రభుత్వం తమదే అన్నారు. మహిళలకు జగనన్నా చేయూత కులమతాలకు అతీతంగా అమలు చేశారన్నారు. అలాంటి వ్యక్తికి మళ్లీ అవకాశం కల్పించాలని ప్రతి కార్యకర్త పనిచేసి 9వ తేది నుండి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమపథకాలపై ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా మైనార్టీ కార్పొరేషన్‌చైర్మెన్ మదీనా దస్తగిరి, వైకాపా మండల అధ్యక్షులు మేకల రత్నకుమార్‌యాదవ్, కన్వీనర్ రాజానాయుడు, సహకార సంఘం చైర్మెన్ నేలటూరు సుబ్బారెడ్డి, మన్నెం శంకర్‌రెడ్డి, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా శీతల పానీయముల శుద్దిజలం

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : దక్షిణ భారతదేశం లోనే అద్భుతకట్టడం కోదండరామాల యం ఎదురుగా ఉన్న శుద్దిజలం కేంద్రం అలంకార ప్రాయంగా మారిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఒంటిమిట్ట కోదండ రామాలయాన్ని రాష్ట్ర దేవాలయంగా ప్రకటించి శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తుండడంతో ప్రతి రోజు వేలాది మంది యాత్రికులు, భక్తులు కోదండరామున్ని దర్శిస్తున్నారు. టీటీడీ అధికారులు గత రెండు నెలల క్రితం రామాలయం ఎదురుగా అన్నప్రసాద కేంద్రం పక్కన భక్తులకు శీతల శుద్దిజలం ఏర్పాటు చేశారు. బోర్డు పెట్టినప్పటికీ ఇంతవరకు నీరు రాకపోవడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తు టీటీడీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ ఈఓ నటేష్‌బాబును వివరణ కోరగా శుద్దిజల కేంద్రం పనిచేస్తుందని నీరు వస్తాయని చెప్పారు. అయితే భక్తులు పరిశీలించగా ఒక్క చుక్క నీరు కూడా రాకపోవడంతో వారు విస్మయం చెంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొందరు టీటీడీ కాంట్రాక్టు అధికారులు ఈ తప్పుదోవకు కారణమని ఉన్నతాధికారుల కు తెలిపి ఇక్కడ పనిచేస్తున్న చిరుద్యోగులపై చర్యలు తీసుకోవాలని అధికారులపై తప్పుడు సమాచారం ఇస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఇలాంటి ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని భక్తులు అంటున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు కళ్లు తెరిచి శుద్దిజల శీతల కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు.

నేడు ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-కడప రూరల్ : నగరంలోని చిలకలబావి దగ్గర ఉన్న ఏఐటీయూసీ ఆఫీసులో సోమవారం ఏఐటీయూసీ కడప నగర సమితి ముఖ్యనాయకుల సమావేశం ఏఐటీయూసీ కడప నగర ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి. అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, మాట్లాడుతూ అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) మన భారతదేశంలో మొట్టమొదటి కేంద్ర కార్మిక సంఘం 1920 అక్టోబర్ 31న దేశ వాణిజ్య రాజధాని ముంబాయి నగరంలో పురుడు పోసుకున్నదని, మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్న రోజులలో కార్మిక గర్జవల నుండి ఏఐటీయూసీ ఆవిర్భవించిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ రంగాలను పరిరక్షించేందుకు కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు దేశ వ్యాప్తంగా కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని వారు కార్మిక లోకానికి పిలుపు నిచ్చారు. అక్టోబర్ 31న ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని కార్మికులకు వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె, మద్దిలేటి, నగర నాయకులు ఆర్ బాబు, నరసింహులు, ఈశ్వరయ్య, వెంకటాద్రి, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

కడప రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-కడప రూరల్ : రైల్వే గూడ్స్ హమాలీల ఉపాధి దెబ్బతినకుండా కడప రైల్వే స్టేషన్ ఆవరణలో జరుగుతున్న గుడ్ సెట్ ఫ్లాట్ఫామ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సోమవారం కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్,గూడ్స్ షెడ్ సూపర్వైజర్ మోహన్ దాస్ లకు హమాలీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్ష కార్యదర్శులు కేసీ.బాదుల్లా,ఎస్. మహబూబాషా,మేస్త్రీలు పాలయ్య, శీను, చిన్న ఓబులేసు, గంగయ్య, నాగేంద్ర, సూరి, సుబ్బరామ్, రంగనాయకులు,మల్లి లు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు వివరిస్తూ గత కొన్ని నెలలుగా కడప రైల్వే స్టేషన్ ఆవరణలో గూడ్స్ షెడ్ ఫ్లాట్ ఫామ్ గతి శక్తి క్రింద జరుగుతున్న రిపేర్లు, రోడ్డు పనులు నెమ్మదిగా కొనసాగడం మూలంగా గూడ్స్ షెడ్ కు రావాల్సిన వ్యాగన్ (రేకు) బియ్యం, ఎరువులు తగ్గిపోవడం జరుగుతున్న దన్నారు,దీని మూలంగా హమాలీలకు ఉపాధి దెబ్బతింటున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. గూడ్స్ షెడ్ కు రావాల్సిన బియ్యం,ఎరువులను కడపకు రోడ్డు మార్గాన తరలిస్తున్నారని గూడ్స్ షెడ్ నమ్ముకొని ఉన్న హమాలి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు లోను కాకమునుపే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆశ్రమవాసులకు అన్నదానం

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె పంచాయతీ పరిధిలోని మదర్ థెరిస్సా అలాగే గండిరోడ్డు లోని మరొక ఆశ్రమంలో సోమవారం ఆశ్రమ వాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచు ఆర్ శీను పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జగనన్న సచివాలయాల కన్వీనర్ ఆర్.శ్రీనివాసులు (సర్పంచ్) పుట్టిన రోజు వేడుకలను వైకాపా నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక రాజీవ్ నగర్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. అలాగే పాత గండిరోడ్డులో ఉన్న మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథవృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అలాగే స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వైకాపా యువనేత ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు పుట్టిన రోజు వేడుకలను అనాధవృద్ధుల మధ్య నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న ఆర్. శ్రీనివాసులుకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పుల్లయ్యతోట నగేష్, బ్రహ్మానందకుమార్, నాయకులు, కార్యకర్తలు నాగేంద్ర, మహేష్, చాంద్ బాషా, భూషణం, ఆదినారాయణ, దివాకర్, రామకృష్ణ, యోగ, బండికేశవ, లోకేష్, గణేష్, అంజి, ప్రసాద్, శ్రీకాంత్, బాబు, సుబ్బయ్య, శివ, పవన్ పాల్గొన్నారు.

ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్‌కు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : బద్వేల్, పోరుమామిళ్ల ఐఎంఏ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తికి సోమవారం సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎంఏ సభ్యులు మాట్లాడుతూ ఈ ప్రాంత డాక్టరుకు ఈ పదవి రావడం ఎంతో ఆనందకరమని మీరు వైద్య రంగంలో ఉన్న ఔట్సోర్సింగ్ పోస్టులను నిరుద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తారని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ నందు వున్న ఖాళీలను వెంటనే భర్తీ చేయమని ముఖ్యమంత్రికి కోరుతానని ఈ ప్రాంత నిరుద్యోగులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ క్రాంతి, డాక్టర్ మీనాక్షి, వాసుదేవరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ కార్తీక్ బాలకృష్ణారెడ్డి, లిల్లీ, పుష్ప, పద్మావతమ్మ, మృదుల, డాక్టర్ దివ్య మరియు డాక్టర్స్ అందరూ పాల్గొన్నారు.

నందవరంకు పాదయాత్ర చేపట్టిన ఎంపీపీ శేఖర్‌యాదవ్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కావాలని, అలాగే ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలి అనే నినాదంతో ఎంపీపీ శేఖర్‌యాదవ్ నందవరంకు పాదయాత్ర చేపట్టారు. ఈ సంధర్భంగా ఆయన రామేశ్వరం మోరీలు వద్ద గల చౌడేశ్వరి దేవి అమ్మవారి గుడిలో పూజలు నిర్వహించి పాదయాత్రను ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాల వారందరికి న్యాయం జరగాలంటే జగనన్నా ఒక్క సారి ముఖ్యమంత్రి అయితే సరిపోదని, మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అవుతూనే ఉండాలన్నారు. మళ్లి జగనన్న ముఖ్యమంత్రి అయితే పేద ప్రజలకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. ప్రొద్దుటూరులో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రొద్దులూరులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. పట్టణంలో ఈ అభివృద్ధి ఆరంభం మాత్రమే అని, మళ్లీ జగనన్నా ముఖ్యమంత్రి అయి హ్యాట్రిక్ సాధిస్తే మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బి.లక్ష్మిదేవి, వైస్‌చైర్మెన్ బంగారురెడ్డి, సీఎస్ ఖాజా, వైకాపా రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, పోలీస్‌కంప్లైంట్ అథారిటి మెంబర్ కాకర్ల నాగశేశారెడ్డితో పాటు పెద్దఎత్తున వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తోగట వీర క్షత్రియ రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా వేల్పుల సుబ్రమణ్యం

విశాలాంధ్ర- చెన్నూరు : తోగట వీర క్షత్రియ రాష్ట్ర యువజన సంఘం ఉపాధ్యక్షులుగా వేల్పుల సుబ్రహ్మణ్యం నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు మోడెమ్ వీరాంజనేయ ప్రసాద్ నేను చేస్తున్న సమాజ సంఘ సేవలు గుర్తించి నన్ను ఉపాధ్యక్షుడు గా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నియామక పత్రం వాట్సప్ ద్వారా పంపారు. యువజన సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన సందర్భంగా రామనపల్లే గ్రామంలో యువకుల అంత కలిసి గణ సన్మానం ఏర్పాటు చేశారు. ప్రజలకు సంఘనికి ఎప్పటికి అధుభాటులో ఉంటు తోగట వీర క్షత్రియుల అభివృద్ధి కోసం నిరంతం కృషి చేస్తాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సుంకర రామచంద్రుడు, గాంగరపు వరుణ్ ,పల్లా రమేష్ ,తప్పెట నరేంద్ర పాల్గొన్నారు.

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : నేడు జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల వలన పైర్లన్ని ఎండిపోతున్నాయి. కడప జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లోని వివిధ రకాల పైర్లు వరి, మొక్కజొన్న, మిరప, మొదలగు పంటలన్నీ తీవ్రంగా దెబ్బతింటున్నవి. వర్షాభావ పరిస్థితుల వలన అనేక చెరువుల కింద వరి ఈసారి చాలా తక్కువగా సాగు అయినది. వడ్లు మంచి రేటు ఉండడంతో ఎక్కువ మంది రైతులు వరివేయాలని వరి నార్లు పోసుకున్నారు. కానీ వర్షాలు చాలా తక్కువగా పడటం వలన వరి నాట్లు వేయలేక నార్లన్నీ కూడా పశువులను మేపారు. కొంతమంది రైతులు బోర్ల కింద వరి సాగు చేశారు వర్షాలు తక్కువగా ఉండటం వలన తీవ్ర మైనటువంటి తెగుళ్లు వ్యాపించినవి. తద్వారా రైతుకు ఖర్చు పెరిగి దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది..నేడు ఉన్నటువంటి దుర్భిక్ష పరిస్థితుల వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి కడప జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి. పంట నష్ట వివరాలు సేకరించి కరువు మండలంగా ప్రకటిస్తే వచ్చేటువంటి ప్రతి ప్రభుత్వ సహాయము ప్రతి రైతుకు వచ్చే విధంగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని బిజెపి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు పత్రికా ముఖంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి దంతిక పీరయ్య, బిజెపి మండల నాయకులు బాలకృష్ణ, శేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు 12 మంది విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-సిద్దవటం : రాష్ట్ర స్థాయిలో జరిగే నెట్ బాల్, స్విమ్మింగ్ పోటీలకు సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు 12 మంది ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఫిజికల్ డైరెక్టర్ రెడ్డెమ్మలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన చెన్నూరు మండలం లోని రామనపల్లి జెడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్లు నెట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక జరిగిందన్నారు. తమ పాఠశాల నుంచి అండర్-14 విభాగం నుంచి 7వ తరగతి చెందిన శివశంకర్, జాస్మిన్ లు ఎంపికయ్యారన్నారు. అండర్-17 విభాగంలో 10వ తరగతికి చెందిన నవీన్, ఇస్మాయిల్ అలీ, 9వ తరగతికి చెందిన ఎన్. నందిని, స్టాండ్లో సిందూరి ఎంపికైయ్యారన్నారు. అండర్ -19 విభాగంలో 10వ తరగతికి చెందిన రమణ, గణేష్, ముఖేష్, స్టాండ్ బైలో సురేంద్ర ఎంపికయ్యారన్నారు. అంతే గాకుండా కడప స్పోర్ట్స్ స్కూల్లో ఈనెల 28వ తేదీన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికలు జరిగాయని, ఈ పోటీలకు 10వ తరగతికి చెందిన డి. వాసు, 9వ తరగతికి చెందిన బి. వెంకటసాయి ఎంపికయ్యారన్నారు. నవంబర్ 9వ తేదీ నుంచి అండర్-17 విభాగం రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరుగుతాయ న్నారు. స్విమ్మింగ్ పోటీలు నవంబర్ 10వ తేదీ నుంచి తిరుపతిలో జరుగుతాయన్నారు. అయితే అండర్-14, అండర్-19 నెట్బాల్ పోటీలు క్రిష్ణా, విజయవాడలో జరుగుతాయని వాటికి ఇంకా డేట్ వెలువడ లేదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-సిద్దవటం : దోమల వల్ల అప్రమత్తంగా ఉండాలని లేదంటే దానివల్ల జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని మలేరియా సబ్యూనిట్ అధికారి ఐ. సుబ్బరాయుడు తెలిపారు. సిద్దవటం మండలం లోని టక్కోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ నివాస గృహాల చుట్టూ మురికి నీటి గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. దానివల్ల దోమ లార్వా ఉత్పత్తి చెంది దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు. రాత్రి వేళల్లో దోమల నివారణకై ఫుల్ వస్త్రాలను ధరించాలని, దోమతెరలు వాడాలన్నారు. వేప పొగను వేసుకుంటే దోమలను నివారించ వచ్చునన్నారు. పూల మొక్కల కుండీల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అలాగే తాగి పడేసిన కొబ్బరి బొండాన్ని రెండు బాగాలు చేయాలన్నారు. దీంతో దోమలను అరికట్ట వచ్చునన్నారు. డెంగ్యూ లక్షణాల నిర్ధారణ కోసం వైద్య శాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని మలేరియా అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పి.కొత్తపల్లి పిహెచ్సీ వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత కోసం పరుగు మంచిదే: ఎస్ఐ

విశాలాంధ్ర-వేంపల్లె: ఐక్యత కోసం పరుగు మంచిదని ఎస్ ఐ తిరుపాల్ నాయక్ పేర్కొన్నారు. పులివెం దుల నియోజకవర్గం వేంపల్లి లో సోమవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశానుసారంగా ,జాతీయ సమైక్యత వారోత్సవాల లో భాగంగా "ఐక్యత కోసం పరుగు " అనే కార్యక్రమాన్ని స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్,స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎన్ సి సి ఆధ్వర్యంలో పరుగును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ ఐక్యత కోసం పరుగు చాలా మంచి కార్యక్రమమన్నారు.ఈ కార్యక్రమంలో తాను కూడా భాగస్వామ్యం కావడం భారతదేశ పౌరుడిగా నా బాధ్యతన్నారు తెలియజేశారు .విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి ఎంఈఓ వీరారెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత అభివృద్ధికి ఐక్యత పునాది వంటిదన్నారు .ఈ పరుగును వేంపల్లి బస్టాండ్ నుండి గండి బైపాస్ రోడ్డు వరకు ,ఐక్యతే -మహాబలము,సాధిద్దాం సాధిద్దాం- ఐక్యతను సాధిద్దాం,కలసి ఉంటే - కలదు సుఖంవంటి నినాదాలతో ప్రజలను ఉత్తేజితం చేశారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యోగంజనేయులు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి,ఎన్సిసి ఆఫీసర్ బుక్కే గోపాల్ నాయక్, పీడి రాజశేఖర్, పీడి తేజేంద్ర ,అధ్యాపక సిబ్బంది, పాల్గొన్నారు.

దేశభక్తి స్ఫూర్తి నింపిన అమృత కలశాలు

విశాలాంధ్ర-పులివెందుల: అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ రాజభవన్‌కు చేర్చిన అమృత కలశాల యాత్ర దేశభక్తి స్ఫూర్తిని నింపిందని కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి రాజు వెల్లడించారు. వైయస్సార్ జిల్లా నుంచి బయలుదేరిన అమృత కలశాలు ఆదివారం ఢిల్లీ చేరాయి. ఆజాదీకా అమృత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వైయస్సార్ జిల్లా నుంచి నెహ్రూ యువ కేంద్రం మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మట్టి కలశాలని తీసుకొని శుక్రవారం కడప జిల్లా నోడల్ అధికారి మొమ్మెల రాజు సమక్షంలో సోమవారం ఢిల్లీ కేంద్రం లోని కుతుబ్మీ యార్ రాధాసాయామి సత్సంగ్ బీస్ నుండి రాజ్ భవన్ కర్తవ్య ఘాట్ కి అమృత్ కలశాను సమర్పించినట్లు రాజు తెలిపారు. గ్రామస్థాయి నుండి పవిత్ర మట్టి, నవ ధాన్యాల అమృత కలశాలతో దేశ రాజధాని రావడం ఈ మహోత్సవ కార్యక్రమంలో పులివెందుల,కడప, కమలాపురం, పెండ్లిమర్రి, వేంపల్లి, వేముల, ఎర్రగుంట్ల స్వచ్ఛంద సంస్థ ల నిర్వాహకులు విజయ్ కుమార్, సుబ్బారావు, హేమంత్, రాఘవేంద్ర రెడ్డి తదితరులతో కలిసి అమృత కలశాలను ఢిల్లీకి తీసుకెళ్లడం తమకెంతో కడప జిల్లా యువతకి ఇది ఆదర్శంగా నిలిచిందన్నారు.

రక్షణ కల్పించండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తమ పొలాన్ని ఆక్రమించు కోవడమే కాకుండా తమను చంపేందుకు ప్రయత్నిస్తున్న అక్బర్ బాష బారి నుంచి తమకు రక్షణ కల్పించి తగిన న్యాయం చేయాలని బాధితులు చెన్నూరు వలి కోరారు. సోమవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దువ్వూరు మండలం ఎర్రబల్లి గ్రామం వద్ద ఉన్న పొలం తగాదా విషయంలో తమపట్ల దౌర్జన్యంగా ప్రవర్తించడమే కాకుండా కోర్టు ఆదేశాలను సైతం దిక్కరించడం జరుగుతోందన్నారు. అంతే కాకుండా సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్ రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం జరుగుతోందన్నారు. అక్బర్ బాషతోపాటు ఆయన సోదరులు, కొంతమంది బంధువులు తమ పొలాన్ని కబ్జా చేసుకుంటే అడిగిన తమను చంపేందుకు సైతం ప్రయత్నించారన్నారు. వీరి దెబ్బకు భయపడి గతంలో చాలామంది గ్రామాన్ని సైతం వదిలి వెళ్లిపోయా రన్నారు. గతంలో ఎలాంటి ఆస్తులు లేని వారు ప్రస్తుతం 60-70 ఎకరాలకు యజమానులయ్యారన్నారు. అన్ని రాజకీయపార్టీలతో వారికి సంబంధాలు ఉన్న కారణంగా వారి ఆగడాలకు అద్దు అదుపు లేకుండా పోతోందన్నారు. అంతేకాకుండా కోర్టులు, పోలీసులను సైతం బెదిరింపులకు పాల్పడటం జరుగుతోందన్నారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరుతూ మీడియాను ఆశ్రయించామన్నారు. సమా వేశంలో బాధితుడు చెన్నూరు వలీతో పాటు ఇతర బాదితులు పాల్గొన్నారు.

బెనర్జీపై దాడి వ్యక్తిగతం
ప్రవీణ్‌కి ఎలాంటి సంబంధం లేదు: మాజీ ఎమ్మెల్యే వరద

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: శనివారం గాంధీరోడ్డులో బెనర్జీపై జరిగిన దాడి వారి వ్యక్తిగతం అని టీడీపీ ఇంచార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి ప్రమేయం లేదని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సోమవారం నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దాడిలో గాయపడ్డ బెనర్జీకి, భరత్‌కుమార్‌రెడ్డి మధ్య గొడవ కారణంగా మాట మాట పెరిగి దాడి జరిగిందే తప్ప తెలుగుదేశం పార్టీకి గాని, ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్‌రెడ్డికు గాని సంబంధం లేదన్నారు. సెల్‌ఫోన్లో చిత్రీకరించిన వీడియోలో ఎక్కడే గాని ప్రవీణ్‌రెడ్డి లేరని, పైగా దాడి జరిగినప్పుడు ఎస్ఐ కూడ అక్కడ ఉన్నాడని అన్నారు. బెనర్జీపై జరిగిన దాడిలో లేని వ్యక్తులను కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి దాడిలో లేని వారిపై కేసు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు 100రోజులు
3వ మొబైల్ భోజన వాహనం ప్రారంభం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి 100 రోజులు పూర్తి చేసుకున్న సంధర్భంగా 3వ మొబై ల్ వాహనాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా పేదల కడుపు నిండా అన్నం పెట్టాలన్న ఆశయంతో ఆనాడు చంద్రబాబు అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటుచేశారని, వైకాపా ప్రభుత్వం అన్నాక్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందన్నారు. చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో ప్రొద్దుటూరులో అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేసి పేదలకు అన్నం పెట్టడం రోజుకు 5వేల మందికి భోజనాన్ని అన్నాక్యాంటీన్ ద్వారా ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీఎస్ ముక్తియార్, రాజేశ్వర్‌రెడ్డి, ఈవి సుధాకర్‌రెడ్డి, శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి, బొర్ర రామాంజినేయులు, నల్లబోతుల నాగరాజు పాల్గొన్నారు.

విశాలాంధ్ర



అన్నమయ్య జిల్లా

జాతీయ సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-రాజంపేట : స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో నవంబర్ 17, 18 వ తేదీలలో నిర్వహించనున్న జాతీయ సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల చైర్మన్ చొప్పా గంగిరెడ్డి తెలియజేశారు. సోమవారం కళాశాలలో జాతీయ సదస్సుకు సంబంధించిన కర పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చొప్ప గంగిరెడ్డి మాట్లాడుతూ బయో ఫార్మా సంవాద్ - 2023 అను పేరుతో ఔషధ రంగం మరియు జీవిత శాస్త్రాలులో నూతన అంశాలు అను ఉద్దేశంతో రెండు రోజులు పాటు ఈ సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనటానికి ఆసక్తి కలిగిన లైఫ్ సైన్సెస్ విద్యార్థులు, సదస్సు నిర్వహణ కార్యదర్శికి 9908344380 అను నెంబర్ ద్వారా, సమన్వయకర్తలను 9912396907, 8500000075 నెంబర్ల ద్వారా చరవాణిలో సంప్రదించాలని తెలిపారు. ఈ సదస్సు నిర్వహణ పట్ల కళాశాల కోశాధికారి, సి.అభిషేక్ రెడ్డి, వైస్ చైర్మన్ సి.ఎల్లారెడ్డి, చైర్మన్ సి.రామచంద్రారెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, డాక్టర్ ద్వారకా నాథ్ రెడ్డి, డాక్టర్ పి.అనిత, అధ్యాపకులు ప్రదీప్ కుమార్, గిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ విశ్వరూప మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : వచ్చే నెల నవంబర్ 18 న శనివారం ఎంఆర్ పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అద్వర్యంలో హైదరాబాద్ లో జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ ను విజయవంతం చేయాలని ఎంఆర్ పిఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు నగిరిపాటి చంగయ్యమాదిగ పిలుపునిచ్చారు. జనసమీకరణ కోసం సోమవారం వివిధ గ్రామాలలో పర్యటిస్తూ పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. ఈ మహసభ దేశంలోనే గుర్తుండిపోయేలా నిర్వహిస్తామన్నారు. మహసభ జరిగే లోపు రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణపై తమ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్వయంగా ఇచ్చిన హామీల అమలులో శ్రద్ధ చూపడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ పట్ల చిన్నచూపు చూస్తే మా సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. కేసులకు బయపడం ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు.

అన్నమయ్య ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షులుగా ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బచోటి భాస్కర్

విశాలాంధ్ర-రాజంపేట: పట్టణ కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం సభా భవనం నందు సోమవారం శ్రీ అన్నమయ్య ప్రెస్ క్లబ్ ప్రతినిధుల సమావేశాన్ని మాజీ అధ్యక్షుడు జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశం అనంతరం జంబు సూర్యనారాయణ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీ అన్నమయ్య ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షులుగా ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు గా దార్ల శ్రీనివాసులు ఆచారి, పాటోలు ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా బచోటి భాస్కర్, కార్యదర్శులు గా తుపాకుల సురేష్, బత్తిన రామసుబ్బారెడ్డి,షేక్ అలీ షేర్, కోశాధికారి జి.వి.పి.ఆర్.కె రాయల్, సహాయ కార్యదర్శులుగా ఏం ఓబులేసు, మందా శివయ్య, కళాంజలి కళ్యాణ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ద్వారకా గోపీనాథ్,కూరాకు శ్రీనివాసులు, ప్రచార కార్యదర్శులు గా నామా హరినాథ్, బి.సునీల్, సి.వెంకటేశ్వర రాజు, కార్యవర్గ సభ్యులు గా కే.వీ సుబ్బయ్య, నరసింహులు, పి.దుర్గయ్య టీ.చంద్రశేఖర్, పి.దివాకర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. జర్నలిస్టులు ఐకమత్యంతో వ్యవహరించి హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీ ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-మదనపల్లి: న్యూ ఢిల్లీ లో జరిగిన ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఇఎంసి మిట్స్ కలశాల కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగములో చివరి సంవత్సరము బి.టెక్ చదువుతున్న కె.సఫియా, ఎ.కృష్ణ, పి.శివ సాయి, ఎన్.యసస్వి మరియు టి.శ్రీజ అను విద్యార్థులు అగ్రికల్చర్ విభాగంలో జాతీయ స్థాయి లో ద్వితీయ బహుమతి లభించింది అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ మాట్లాడుతూ ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఐఎంసి అనేది ఆసియాలో అతిపెద్ద టెలికాం, మీడియా మరియు టెక్నాలజీ ఫోరమ్ అని, దీనిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ డీఓటీ మరియు సెల్యులార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సిఓఏ ఐ సంయుక్తంగా నిర్వహించాయన్నారు. ఇందులో జాతీయ స్థాయిలో విద్యార్థులు కమ్యూనికేషన్ రంగంలో నూతనంగా కనుగొన్న టెక్నాలజీలను ఇందులో ప్రదర్శించారని, అందులో విద్యార్థులు అగ్రికల్చర్ (వ్యవసాయ) విభాగంలో రెండవ బహుమతి లభించిందన్నారు. విద్యార్థులు తయారుచేసిన బౌదరీ ఫైండింగ్ స్టిక్క అను అప్ ను ఇందులో ప్రదర్శించి ఈ బహుమతి పొందినట్లు ఆయన అన్నారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఆసియాలోనే అతిపెద్ద టెక్నాలజీ ఈవెంట్, టెక్నాలజీ రంగంలో భారతదేశంలోనే అతిపెద్ద నెట్‌వర్కింగ్ ఈవెంట్. విప్లవాత్మక ఆవిష్కరణల ప్రదర్శన ద్వారా, భారతదేశాన్ని వెలుగులోకి తీసుకురావడం ముఖ్య ఉద్దేశంగా న్యూ ఢిల్లీ లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం, విద్యార్థులు అందులో పాల్గొని ప్రతిభకనపరచడం గర్వించదగ్గ విషయం అని ఈ విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ఘనంగా ముగిసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర -సుండుపల్లె : క్రీడలతో క్రీడాకారు లకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాయచోటి రూరల్ సీఐ తులసిరామ్ తెలిపారు. సోమవారం సుండుపల్లి మండల కేంద్రంలో గత 15 రోజుల నుండి పుత్తంబాకు వరదయ్య నాయుడు జ్ఞాపకార్థం జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు సిఐ బహుమతులను అందజేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటమిని విజయానికి తొలిమెట్టుగా భావించాలన్నారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును అరవింద రాజు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును మహమ్మద్ గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు దొరస్వామి నాయుడు, హెడ్ కానిస్టేబుల్ బిడి నాయక్, జనసేన నాయకులు వంటేరు రాజా, టిడిపి నాయకులు సురేష్ కుమార్ నాయుడు, మస్తాన్ బాబు,చంద్రమోహన్, రమణ ఆర్గనైజర్ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయరుపై దాడికి యత్నించిన నాయకులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్ :పీలేరు తహసిల్దార్ కార్యాలయంలో సర్వేయర్ రెడ్డెప్పపై దాడికి యత్నించిన అధికార వైస్సార్సీపీ నాయకులను అరెస్టు చేయాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉండే భూమికి తాను ఎంజాయ్ మెంట్ సర్టిఫికేట్ ఇవ్వడం కుదరదన్న సర్వేయర్ రెడ్డప్పపై వైసిపి నేతలు అనిల్ రెడ్డి,సునీల్ రెడ్డిలు దుర్భాషలాడుతూ దాడి ప్రయత్నించారు.సర్టిఫికెట్ ఇవ్వకపోతే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించి అసభ్య పదజాలంతో దూషించడం బాధాకరమన్నారు.వైకాపా పాలనలో అధికారులకే రక్షణ కరువైందన్నారు.తాము చెప్పినట్లు నడుచుకోని అధికారులను ఇబ్బంది పెట్టడం,వేధించడం,భయభ్రాంతులకు గురిచేయడం వైకాపా నాయకుల వైఖరికి నిదర్శనమన్నారు.నిజాయితీగా పని చేయడమే అధికారులు తప్పా అని ఆయన ప్రశ్నించారు. అధికారులు,ప్రతిపక్ష నాయకులకే రక్షణలేని ఈ రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇటువంటి విధానాలను వైసిపి నాయకులు మానుకోవాలని హితవు పలికారు.ఈ ఘటనపై సర్వేయర్ రెడ్డెప్ప స్థానిక పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.సర్వేయరుపై దాడి చేసిన వైసిపి నాయకులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

విశాలాంధ్ర-రాయచోటి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రేపన వెంకటేశ్వర అనే ముద్దాయికి రాయచోటి ఏజెఎఫ్ సీఎం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇషరత్ ఫాతిమా మూడు రోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్సై ఎస్ ఎండి షరీఫ్ తెలిపారు. అక్టోబర్ ఆరవ తేదీన కొండ వాండ్లపల్లి క్రాస్ వద్ద సంబేపల్లి పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకటేశ్వర పై కేసు నమోదు చేశారు. సోమవారం కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను పకడ్బందీగా నిర్వహించాలి:కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీష పి ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హల్ నందు జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో, తదితర అంశాలపై మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడిఓ లు, ఎంఈవోలు,లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను అన్ని మండలాల్లో జాగ్రత్తగా చిన్నపాటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి పెట్టి క్యాంప్ లను నిర్వహించాలన్నారు. శిబిరాల్లో ఓపి డేటా ఎంట్రీ తప్పకుండా చేయించాలని మందుల పంపిణీ కేంద్రంలో ఫార్మసిస్టు ఖచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరి ఫోన్లో ఆరోగ్యశ్రీ యాప్ ను డౌన్లోడ్ చేయించి లాగిన్ చేయించారా లేదా అనేది పరిశీలించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎప్పటికప్పుడు విజిట్ చేసి రిపోర్టు పంపాలన్నారు.జిల్లాలో బడి బయట ఉన్న బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో) చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో కు సంబంధించి 5-18 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి, ఇంటర్ లో ఫెయిల్ అయిన విద్యార్థులను మరల తిరిగి పాఠశాలల్లో, కళాశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, వారికి అమ్మ ఒడి పథకం వస్తుందనే విషయాన్ని తెలియచేయాలని, ఒక వేళ వారు చేరకపోతే ఓపెన్ స్కూల్ లోనైనా చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓలు పూర్తి స్థాయిలో సమన్వయం చేసుకొని వందశాతం గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో పూర్తి చేయాలన్నారు. ఎంఈఓలు వారి పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ లేని గ్రామంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దళితుల జోలికొస్తే సహించేది లేదు

దళితులపై దాడి ఘటనపై ఎస్సీ కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర- సుండుపల్లె : మండలం మడితాడు గ్రామపంచాయతీ దళిత కుటుంబానికి చెందిన చిన్నప్పపై రాయవరం గ్రామంలోని పవన్ అతని అనుచరులు చేసిన దాడి విషయంపై ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా బాధితులను బాధితులను ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పరామర్శించారు. ఆయన జరిగిన సంఘటనను వివరిస్తూ ఈనెల 27వ తేదీన రావడం చెందిన కొందరు మడితాడు గ్రామానికి చెందిన ట్రాక్టర్ ద్వారా మట్టిని తోలుకుంటూ జీవనాధారం సాగిస్తున్న చిన్నప్పకు ఇసుక తోలవలసిందిగా అడిగారని, దానికి అనుమతులు లేనిదే తాను ఇసుక తోలులేనని చిన్నప్ప చెప్పారని, కానీ విషయాన్ని తప్పుగా అర్థం చేసుకున్న రాయవరం గ్రామానికి చెందిన పవన్ చిన్నప్ప కు ఫోన్ చేసి నా గ్రామంలో ఇసుక తోలేందుకు నీకు ఎంత ధైర్యం వచ్చింది అని కులం పేరుతో దుర్భాషలాడుతూ నువ్వు ఎక్కడుంటే అక్కడ వస్తాను అని చెప్పారని, తాను ప్రస్తుతం గుట్టకిందరాచపల్లిలో ఉన్నానని చిన్నప్ప చెప్పగా సుమారు 9 ద్విచక్ర వాహనాలలో వచ్చి దాడి చేశారని, దాడిని అడ్డుకోబోయిన 65 సంవత్సరాల పెద్ద చిన్నప్ప అనే వ్యక్తిని కూడా దారుణంగా కొట్టారని ఇప్పుడు చిన్నప్ప లేవలేని స్థితిలో ఉన్నారని, మాపై దాడి జరిగింది అని పోలీస్ స్టేషన్కు వెళ్లి కేసు పెట్టాలని చూడగా, స్టేషన్ అధికారి రామకృష్ణారెడ్డి రక్తం కారుతున్న పెద్ద చిన్నప్పను ఆసుపత్రికి కూడా తీసుకొని పోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పైగా బాధితులపై చేయి చేసుకున్నారని, ఇంత అన్యాయంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిఎస్పీ మహబూబ్ బాషాను ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ఆదేశించారు. అదేవిధంగా రాయవరం మిట్టమీద పల్లె దళితులకు చెందిన దారి ఆక్రమణ విషయంలో కూడా ఎస్సీ కమిషన్ చైర్మన్ ఆర్డిఓ, తాసిల్దార్ ఎంపీడీవోలను ప్రశ్నించారు. దళితుల ఇళ్లకు దారిని అడ్డగించడం నేరమని అధికారులు ఏం చేస్తున్నారంటే ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల ఇళ్లకు దారిని ఆక్రమించిన సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని, గోడను తొలగించాలని ఆర్డీవోని ఆదేశించారు. ఈ ఘటనలపై డిఎస్పి మహబూబ్ భాషా స్పందిస్తూ ఘటనపై తనకు సమాచారం ఆలస్యంగా అందిందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించి కేసును తప్పుదోవ పట్టించిన అధికారులపై శాఖా పరమైన చర్యలు తప్పకుండా తీసుకుంటామని తెలిపారు. రాయవరం దళితుల ఇళ్లకు దారి ఆక్రమణ విషయంపై ఆర్డీవో స్పందిస్తూ ఎస్సీ కమిషన్ ఆదేశాలను తప్పక పాటిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల తప్పిదం వల్లే అన్నమయ్య డ్యాం తెగిపోయింది

సంఘటన జరిగి రెండేళ్లు అవుతున్నా బాధితులను పట్టించుకోని ప్రభుత్వం
బాధితులను ఆదుకుంటామని సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన వాగ్దానాలకు దిక్కులేదు
టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ఆరోపణ

విశాలాంధ్ర -రాజంపేట: వైసిపి నాయకుల మానవ తప్పిదం వల్లే అన్నమయ్య డ్యాం తెగిపోయిందంటూ టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ఆరోపించారు. అన్నమయ్య డ్యాం బాధితుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలంటూ జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గ నాయకులు అతికారి దినేష్ ఆధ్వర్యంలో జనసైనికులు సోమవారం రాయచోటి లోని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్ష కు జగన్ మోహన్ రాజు సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ పై, వైసిపి నాయకుల పై ఆయన విమర్శలు గుప్పించారు. అన్నమయ్య డ్యాం తెగిపోయి రెండేళ్లు పూర్తి కావస్తున్నా నేటికి ఈ వైసిపి ప్రభుత్వం బాధితులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. బాధితులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన వాగ్దానాలకు దిక్కులేదని, మేము మూడు నుంచి నాలుగు నెలల్లో బాధితులకు ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. కానీ నేటికి రెండేళ్లు పూర్తి అయ్యింది ఇప్పటికి అతిగతి లేదన్నారు. రైతులకు పంట నష్టం ఇస్తామని చెప్పారు కానీ ఇప్పటి వరకు పంట నష్టపరిహారం అందించలేదంటూ ఆయన ప్రభుత్వంపై ధ్వజ మెత్తారు. అన్నమయ్య డ్యాం బాధితులకు న్యాయం జరిగేంతవరకు జనసేనతో కలిసి టిడిపి ముందుండి పోరాడుతుందని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మాజీ జడ్పిటిసి చలమయ్య యాదవ్,వీరబల్లి మండల టిడిపి అధ్యక్షుడు భాను గోపాల్ రాజు,నాగిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, రాజంపేట మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎద్దుల విజయసాగర్. తులసి నాగేంద్ర, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైకాపా పార్టీని ఇంటికి సాగనంపాలి

సమన్వయ కమిటీ సమావేశంలో నల్లారి

విశాలాంధ్ర-పీలేరు: అక్రమాలు, అపద్దాలు దోచుకోవడాలు, దాచుకోవడాలు పునాదిగా పుట్టిన వైసిపి పార్టీకి ఇంటికి సాగనంపడానికి వచ్చేఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులు సిద్ధంగా ఉండాలని,తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరుజిల్లా టీడీపీ, జనసేన పార్టీల నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్రకమిటీ,జిల్లాకమిటీ నాయకులు పాల్గొన్నారు.ఈకార్యక్రమం బీద రవిచంద్ర యాదవ్,బొలిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిధిగా కిషోర్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ తప్పుచేయని వారిపై 307 కేసులు నమోదు చేయడం వైకాపా పార్టీ నాయకులకు పుట్టుకతో వచ్చాయని, ఏతప్పుచేయని తెలుగుదేశంపార్టీ నాయకులు,శ్రేణులపై కేసులు నమోదు చేసి రాక్షసానందం పొందడం అవివేకమని అన్నారు.52రోజులుగా చంద్రబాబును నాలుగు గోడల మధ్య బంధించి ఒక్క ఆధారం చూపలేని పరిస్థితి రాష్ట్రంలో ఉందని అన్నారు. అక్రమాల్ని ప్రశ్నిస్తే కేసులు,నిరసనలు తెలియచేస్తే కేసులు, రోడ్డుపైకి వస్తే కేసులు ఇదేనా రాష్ట్ర అభివృద్ధి అంటూ మండిపడ్డారు.చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే తను జైలుకు వెళ్లడం తప్పదని తెలుసుకొన్న జగన్మోహన్ రెడ్డి కక్షపూరితంగా అక్రమ అరెస్ట్ చేశారనిఅన్నారు.

రెవిన్యూ సిబ్బంది బాధ్యతగా పని చేయాలి:తహశీల్దారు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: మండల పరిధిలోని రెవెన్యూ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని తహశీల్దార్ బి.రామమోహన్ పేర్కొన్నారు.సోమవారం ఉదయం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫీసుకు వచ్చినాం, పోయినాం అనేది కాకుండా మనం ఎంత వరకు పనిచేశామన్నది ముఖ్యమన్నారు. ప్రతి పని బాధ్యతగా చేయాలన్నారు. ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. జగనన్న కాలనీ లపై దృష్టి పెట్టాలన్నారు. స్థానిక సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. డిప్యూటి తహశీల్దార్ డి.అమరేశ్వేరి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మానస, ఆర్ఐ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున రెడ్డి, సర్వేయర్ సుదర్శన్, విఆర్ఓ లు, విఆర్ఏ, రెవిన్యూ స్టాఫ్ పాల్గొన్నారు.

తోటవీర క్షత్రియ సంక్షేమ సేవా సంఘం

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ధన శేఖర్

విశాలాంధ్ర - సుండుపల్లె : రాష్ట్ర తొగుటవీర క్షత్రియ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ధన శేఖర్ రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ నియమించినట్లు తెలిపారు. ధన మాట్లాడుతూ చోటు వీర క్షత్రియ సంక్షేమ సేవా సంఘం కోసం ఎల్లవేళలా తన శక్తి వంచన లేకుండా పనిచేస్తానని అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకులకు జరుగుతున్న అన్యాయాన్ని దేశవ్యాప్తంగా తెలియజేస్తాం

రాష్ట్రీయ వాల్మీకి దర్మసమాజ్ రాష్ట్ర అధ్యక్షులు మేకల విజయ్ మోహన్ వెల్లడి

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: రాష్ట్రంలో వాల్మీకులకు జరుగుతున్న అన్యాయాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న వాల్మీకి సంఘాల దృష్టికి తీసుకువెళ్ళి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వాల్మీకులు అందరికి ఎస్టీ సాధించే దిశగా పని చేస్తామని రాష్ట్రీయ వాల్మీకి దర్మసమాజ్ రాష్ట్ర అధ్యక్షులు మేకల విజయ్ మోహన్ వెల్లడించారు.సోమవారం ప్రెస్‌క్లబ్ నందు జరిగిన విలేఖరుల సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల రాష్ట్రీయ వాల్మీకి దర్మసమాజ్ అధ్యక్షులు గంపల గంగరాజు ఆద్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రీయ వాల్మీకి దర్మసమాజ్ నూతన కమిటీ ప్రకటించారు.ఈ సందర్భంగా మేకల విజయ్ మోహన్ పుట్టిన రోజు సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు, వాల్మీకి సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ వాల్మీకి దర్మసమాజ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా బొగ్గిటి క్రిష్ణమూర్తి, అధ్యక్షులుగా మేకల విజయ్ మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పూలకుంట్ల హరి బాబు, రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ కొటికి శ్రీనివాసులు, రాష్ట్ర సెక్రటరీ మానేరి హరి కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మార కృష్ణ మూర్తి, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ పిడుగు రఘునాథ్, అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా మేకల వెంక్రమణ (బాబు) లకు దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు గంపల గంగరాజు చేతుల మీదుగా నియమక ప్రత్రాలు అందించారు. వాల్మీకి పెద్దలు, నాయకులు నూతన కమిటీ వారికి అభినందనలు తెలియజేశారు..

ఫిర్యాదులు పరిష్కారంలో అలసత్వం వహించొద్దు: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీల పరిష్కారంలో ఎట్టి పరిస్థితిలో అలసత్వం వహించకుండా సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాలు నందు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టరు తోపాటు డిఆర్వో సత్యనారాయణ, కలెక్టరేట్ ఎస్డిసిపి శ్రీలేఖ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి అర్జీలను స్వీకరించారు.

వినాయక విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న చైర్మన్

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : అనంతరాజుపేట గ్రామపంచాయితీ పరిధిలోని అగ్రికల్చర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం జరిగిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.మొదట చైర్మన్‌కు కళాశాల బృందం, అర్చకులు భక్తి శ్రద్ధలతో ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, మరియు స్థానిక మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఎంఎల్‌ఏ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-రాయచోటి: ప్రతి సోమవారం రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాల యాలకు వచ్చే జగనన్నకు చెపుదాం గ్రీవెన్ సెల్ అర్జీదారులు, ప్రజలకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం 39వ వారానికి చేరుకుంది. ఎంఎల్ఏ సౌజన్యంతో ఈ సోమవారం జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు వచ్చిన అర్జీ దారులు, ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తుండడం హర్షణీయం, ఆదర్శనీయమంటూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అభినందిస్తున్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆకేపాటి

విశాలాంధ్ర - సుండుపల్లె : మడితాడు పంచాయతీ కస్పాకు చెందిన జనాబ్ షేక్ షఫీఉల్లా చిన్న కుమారుడు పెండ్లి సందర్భంగా హాజరై నూతన వధూ వరులను జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఆశీర్వదించారు. వీరితో పాటు రాజంపేట నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యర్రపురెడ్డి అజయ్ రెడ్డి,స్టేట్ డైరెక్టర్ అజం తమ్మ, జడ్పిటిసి ఇస్మాయిల్, బిఎల్ నరసింహారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి ఆరంరెడ్డి,మాజీ ఎంపీటీసీ చంద్రనాయక్, మోహన్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, చంద్రపాల్, బాబు రెడ్డి,కరీంబాషా,తోపాటు పార్టీ నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు వాల్మీకిపురంలో జాబ్ మేళా

విశాలాంధ్ర-పీలేరు: వాల్మీకిపురం ప్రభుత్వ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నారు .చెన్నై బెంగళూరు వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 20 కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు రావడం జరిగింది.లబ్ధిదారులను స్థానిక వాలంటరీలు ,అధికారులు పేర్లు నమోదు చేసుకోవడం జరిగింది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ఉద్యోగుల ఎంపిక జరుగుతుంద ని నిర్వాహకులు తెలిపారు ముఖ్య అతిథిగా పీలేరు శాసనసభ్యులుచింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని అలాగే అధికారుల పర్యవేక్షణలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు.

కంప చెట్లను తొలగించిన సిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : కడప రేణిగుంట 716 నెంబర్ గల జాతీయ రహదారిలో ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి మలుపుల వద్ద రహదారిలోకి వంగిన కంపమొక్కలను సోమవారం సిఐ టి.మదుసూధన్ రెడ్డి రంగ ప్రవేశం చేసి రాఘవరాజుపురం అనంతరాజుపేట మద్య జెసిబి ద్వారా కంపమొక్కలను తొలగించి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టారు. అత్యంత ప్రమాదాలు జరిగే చోట సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో అప్రమత్తంగా వ్యవహరించి వాహనాలను డ్రైవింగ్ చేయాలని సూచించారు. అతి వేగం ప్రమాద కరమన్నారు. ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ ప్రకారం డ్రైవింగ్ చేయాలన్నారు. నిర్లక్షంగా డ్రైవింగ్ చేయడం వలన, అతివేగం వలన, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ఈ మూడు కారణాలచేతనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు స్థానిక ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సిఐ వెంట కానిస్టేబుల్ అనిల్ కుమార్, సుమన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీలకు గ్రీష్మ

విశాలాంధ్ర-పీలేరు : రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు వాల్మీకిపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని జి.గ్రీష్మ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 29న గ్యారంపల్లె రెసిడెన్సియల్ స్కూల్ నందు జరిగిన అండర్ 19జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరచిన గ్రీష్మ సెలెక్టర్లను ఆకట్టుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వరగా కుర్నూలు లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు తరపున గ్రీష్మ పాల్గొననుంది. ఈ సందర్భంగా విద్యార్థిని గ్రీష్మను పాఠశాల పి.డి.లు ధనలక్ష్మి, ప్రియాంక, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి:సిడిపివో

విశాలాంధ్ర- గాలివీడు: బాల్య వివాహాలను నిర్మూలించాలని లక్కిరెడ్డిపల్లి సిడిపివో పద్మావతి తెలిపారు.సోమవారం మండలంలోని నూలివీడు సెక్టార్ స్థాయి నందు బాల్య వివాహాల నిర్మూలన మరియు రక్త హీనత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహం దురాచారం అని, దీని వల్ల పిల్లలు ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులోనే వివాహం చేయడాన్ని మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్‌లు, ఎంఎస్కే,అంగన్వాడీ కార్యర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు